మూడు విడతల్లో రుణమాఫీ

- నేడు లక్ష వరకు, నెలాఖరులోగా 1.5 లక్షలు
- ఆగస్టులో రూ.2 లక్షల వరకు రుణమాఫీ
- రుణమాఫీపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి
- కాంగ్రెస్ పార్టీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- రుణమాఫీ కోసం నిద్రలేని రాత్రులు గడిపాం: భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 17(నమస్తే తెలంగాణ): రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని మూడు విడతల్లో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం రూ.లక్ష వరకు, నెలాఖరులోగా రూ.1.5 లక్షల వరకు, ఆగస్టులో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని స్పష్టంచేశారు. బుధవారం ఆయన ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేస్తున్నట్టు తెలిపారు. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇస్తే ఆర్థిక నిపుణులు కష్టమని అన్నారని, కానీ దానిని ఇప్పుడు నిజం చేసి చూపిస్తున్నామని చెప్పారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రూ.28 వేల కోట్లు కూడా రైతు రుణమాఫీ చేయలేకపోయిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న రుణమాఫీ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, దేశ వ్యవసాయ విధానంలో మాడల్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. తన జీవితంలో ఈ రోజు ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆనందం వ్యక్తంచేశారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా రూ.లక్ష వరకు గల రుణాలను మాఫీ చేస్తామని, మొత్తం రూ.7వేల కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని తెలిపారు. రుణమాఫీపై జాతీయస్థాయిలో చర్చ జరిగేలా చేయాలని పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఒకే విడతలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీ చేయలేదని స్పష్టంచేశారు. రుణమాఫీ తర్వాత గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కూడలి నుంచి రైతు వేదికల వరకు బైక్ ర్యాలీలు నిర్వహించాలని, ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. రాష్ట్రంలో రుణమాఫీ సందర్భంగా ఎక్కడికక్కడ ఒక పండగ వాతావరణం ఉండాలని, సంబురాలు చేయాలని పిలుపునిచ్చారు.

నిద్రలేని రాత్రులు గడిపాం: భట్టి విక్రమార్క

రుణమాఫీ కార్యక్రమం అమలు చేసేందుకు నిద్రలేని రాత్రులు గడిపామని, రూపాయి రూపాయి పోగుచేసి రుణమాఫీ చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. అన్ని కుటుంబాలకు రుణమాఫీ చేస్తామని, రేషన్‌కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు కూడా రుణమాఫీ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి పోలింగ్ బూతు, ప్రతి ఓటర్ దగ్గరకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే ఐదు హామీలు అమలుచేస్తున్నామని చెప్పారు. అయితే అనుకున్నంతగా ఈ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రచారం జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

రుణాలను ఒకేసారి మాఫీ చేయాలి

బ్యాంకుల్లో రూ.2 లక్షల్లోపు పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని వర్తింపచేయడానికి పలు రకాల నిబంధనలు పెడుతున్నారు. ఈ విధంగా షరతులు పెట్టడం సమంజసం కాదు. పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేయాలి. అదేవిధంగా రూ.2 లక్షల లోపు తీసుకున్న రుణాలను ఒకేసారి మాఫీ చేస్తే బాగుంటుంది.

-శేరి నారాయణరెడ్డి, చౌదర్‌పల్లి

రైతులకు న్యాయం చేయాలి

బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీని వర్తింపచేసి న్యాయం చేయాలి. రేషన్‌కార్డు ఉన్నవారికే రుణమాఫీ వర్తిస్తుందన్న షరతులు విధించడం సరికాదు. ఎక్కువ విస్తీర్ణం భూమి ఉన్న రైతులకు రేషన్‌కార్డులు ఉండవు. అటువంటి రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు స్పష్టంగా లేక రైతుల్లో గందరగోళం నెలకొన్నది.

-శ్యామలయ్యగౌడ్, రేగడిమైలారం

బేషరతుగా రుణమాఫీ చేయాలి

- రైతులకు నష్టం జరిగితే ఊరుకోం
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

కురవిలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

కురవి, జూలై 17: రాష్ట్రంలో రైతులకు నష్టం జరిగితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ హెచ్చరించారు. రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి రైతుల సంఖ్యను తగ్గించేందుకు కాంగ్రెస్ సర్కార్ కొర్రీలు పెడుతున్నదని విమర్శించారు. ప్రస్తుత నిబంధనలు చూస్తే కనీసం 50 శాతం రైతులకు కూడా రుణమాఫీ అయ్యే అవకాశం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఆమె మహబూబాబాద్ జిల్లా కురవి వీరభద్రస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉన్నన్ని రోజులు రాష్ట్ర సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్ పేరును ప్రజలు మర్చిపోరని అన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు రైతుల కష్టాలను సీఎం దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. పార్టీలో చేరికలపై ఉన్న శ్రద్ధ ప్రజలకు అందించే పాలనపై సీఎం రేవంత్‌రెడ్డికి లేదని దుయ్యబట్టారు. అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టిన కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించే రోజు దగ్గరలోనే ఉన్నదని అన్నారు. కేసీఆర్‌ను అభాసుపాలు చేయాలనే కుట్ర కోణంతోనే సీఎం రేవంత్‌రెడ్డి కాలం వెల్లదీస్తున్నాడని మండిపడ్డారు. సుప్రీం కోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజలు మరిచిపోవాలనే రేవంత్‌రెడ్డి రోజుకో కమిషన్ పేరిట కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. మహబూబాబాద్ మున్సిపాలిటీకి రూ. 50 కోట్లు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీలకు రూ. 25 కోట్ల చొప్పున నిధులను మంజూరు చేయించామని, ఆ పనులు పూర్తి చేస్తే తామే ప్రజాప్రతినిధులను సన్మానిస్తామని తెలిపారు. అంగన్‌వాడీలకు గుర్తింపు తీసుకువచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమన్న విషయాన్ని ఆ శాఖ మంత్రి సీతక్క మర్చిపోవద్దని సూచించారు. అంగన్‌వాడీలకు రూ.13 వేల వేతనంతోపాటు పదవీకాలం ముగిస్తే రూ. 2 లక్షలు ఇవ్వాలనే జీవోను తీసుకువచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. ఎన్నికల కోడ్‌తో ఆ జీవో బయటకు రాలేదని, అది కూడా కాంగ్రెస్ చేసినట్టు చెప్పుకోవడం శోచనీయమని అన్నారు.

నేడు లక్ష రుణం మాఫీ

మొదటిపేజీ తరువాయి...

పెట్టిన ప్రభుత్వం ఆ ప్రక్రియ పూర్తి కాగానే రైతు వేదికల్లో సంబురాలు నిర్వహించాలని నిర్ణయించింది. రుణమాఫీ నిధులను విడుదల చేసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా రైతులతో మాట్లాడనున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రైతువేదికల్లో వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి స్థానిక అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతి గ్రామం నుంచి రైతులను తరలించే ఏర్పాట్లు చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వారి వారి నియోజకవర్గాల్లో రుణమాఫీ సంబురాల్లో పాల్గొననున్నారు.

జాబితాలపై ఫిర్యాదులు.. రైతుల్లో ఆందోళన

రుణమాఫీకి సంబంధించి అధికారులు రూపొందించిన జాబితాపై గ్రామాల్లో గందరగోళం నెలకొన్నది. తమ పేర్లు జాబితాలో లేవంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి రూ.లక్ష వరకు గల రుణ గ్రహీతల జాబితాను వ్యవసాయ శాఖ జిల్లాలకు విడుదల చేసింది. అయితే ఇందులో పలు సమస్యలు ఎదురైనట్టు తెలిసింది. బుధవారం రాత్రి వరకు కూడా కొన్ని జిల్లాల్లో ఏఈవోలకు జాబితా అందలేదని సమాచారం. మరోవైపు, జాబితాలో పేర్లపై రైతుల్లో ఆందోళన నెలకొన్నది. రూ.లక్షలోపు రుణం ఉన్నప్పటికీ తమ పేరు జాబితాలో లేదంటూ వ్యవసాయ శాఖ అధికారులకు పలువురు రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ విడుదల చేసిన జాబితాలో కేవలం రైతు పేరు, గ్రామం, క్లస్టర్ పేరు మాత్రమే ఉన్నది. ఏ రైతుకు ఎంత మాఫీ చేస్తున్నారనే వివరాలను జాబితాలో పేర్కొనలేదు.

ప్రభుత్వానిది చరిత్రాత్మక నిర్ణయం

రుణమాఫీపై మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): రైతులను రుణ విముక్తులను చేసే చరిత్రాత్మక నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తూ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని ప్రశంసించారు. రుణమాఫీకి ఆర్థిక పరిస్థితి సహకరించపోయినా రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. ఆగస్టు 15కు నెల రోజుల ముందుగానే హామీని నిలబెట్టుకున్నామని పేర్కొన్నారు. గురువారం లక్ష వరకు రుణమాఫీ అమలవుతున్నదని, సాయంత్రం వరకు రైతు రుణ ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని స్పష్టంచేశారు. ఈ రోజు రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించవలసిన రోజు అని పేర్కొన్నారు.

రైతు భరోసా ఎగ్గొట్టి రుణమాఫీకి నిధులు

మొదటిపేజీ తరువాయి...

మీద ఆంక్షలు, షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం చెప్పినట్టుగా రేషన్‌కార్డు ప్రామాణికం కాదని మార్గదర్శకాల్లో ఎందుకు సవరణ చేయలేదని ప్రశ్నించారు. పాస్‌బుక్కు ఆధారంగా రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆంక్షలు, షరతులు లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.29వేల కోట్ల రుణమాఫీ చేసిందని ఆయన గుర్తుచేశారు. రైతుల సంఖ్యను కుదించేందుకే రుణమాఫీ మార్గదర్శకాలు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. గురువారం 11లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తే, మిగిలిన 49లక్షల మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రేషన్ కార్డు లేని కుటుంబాల పరిస్థితి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కొద్దిమందికే రుణమాఫీ ఇచ్చి సంబురాలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని, రైతు భరోసా ఎగ్గొట్టి రుణమాఫీకి నిధులు మళ్లిస్తున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కట్టిన రైతువేదికలే నేడు కాంగ్రెస్ వేడుకలకు పనికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఆనాడు వ్యతిరేకించిన రైతు వేదికలు, కాళేశ్వరం, సచివాలయాలు నేడు కాంగ్రెస్ పార్టీకి దిక్కయ్యాయని ఎద్దేవా చేశారు.

పదేండ్లు పండుగలా ఎవుసం

వ్యవసాయం బలపడితే వేలమందికి ఉపాధి దొరుకుతుందని పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్నదాతలకు అండగా నిలిచామని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా, సాగునీరు, ఉచిత కరెంటు, పంటల కొనుగోళ్లు చేసి రైతులలో ఆత్మవిశ్వాసం నింపామని స్పష్టం చేశారు. 2014లో 1.31కోట్ల ఎకరాలలో ఉన్న సాగును 2.38కోట్ల ఎకరాలకు పెంచామని చెప్పారు. 68లక్షల మెట్రిక్ టన్నులు ఉన్న ధాన్యం ఉత్పత్తిని దాదాపు 3 కోట్ల టన్నులకు పెంచుకున్నామని తెలిపారు. అప్పు కోసం చేయిచాచని అన్నదాత కోసం పదేండ్లు పనిచేశామని, రైతుల హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నదని ఆయన విమర్శించారు.

ఉత్తమ వార్తా చిత్రం పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

జర్నలిస్టులకు ఉత్తమ వార్తాచిత్రం పోటీలు

పోస్టర్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

జూబ్లీహిల్స్, జూలై17: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఉత్తమ వార్తాచిత్రం పోటీల పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆవిష్కరించారు. న్యూస్ ఫొటో కాంటెస్ట్‌తో నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చని భట్టి విక్రమార్క తెలిపారు. 2024-25 ఉత్తమ వార్తాచిత్రం పోటీల విజేతలకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ రూ.8 వేలు, తృతీయ రూ.5 వేలు, రూ.2 వేల చొప్పున 25 కన్సోలేషన్ బహుమతులతోపాటు సర్టిఫికెట్, మెమొంటోలను అందజేస్తామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవన్ హరి తెలిపారు. పోటీలలో పాల్గొనే జర్నలిస్ట్‌లు 8/12 సైజ్ ఫొటోలను టీఎస్‌పీజీఏ కార్యాలయం, టీయూడబ్ల్యూజే బిల్డింగ్, దేశోద్ధారక భవన్, బషీర్‌బాగ్, హైదరాబాద్‌కు ఆగస్టు 10లోపు పంపాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌పీజీఏ రాష్ట్ర నేతలు నగర గోపాల్, అలీముద్దీన్, హరి ప్రేమ్, ఆనంద్ ధర్మాన, వీ రజినీకాంత్, సుమన్‌రెడ్డి, శివకుమార్, అశోకుడు పాల్గొన్నారు.

రవాణాశాఖ స్పెషల్ డ్రైవ్.. 8.72 కోట్ల ఆదాయం

- 50 రోజుల్లోనే వసూలు చేసిన అధికారులు
- రాష్ట్ర వ్యాప్తంగా 936 వాహనాలకు జరిమానా

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): రవాణా శాఖ చేపట్టిన 'స్పెషల్ డ్రైవ్' ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. కేవలం 50 రోజుల వ్యవధిలో 936 వాహనాల నుంచి జరిమానాల ద్వారా సుమారు రూ. 8.72 కోట్లు వసూలు చేసింది. ఫిట్‌నెస్ లేని బస్సులు, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై జూన్ 1 నుంచి రవాణాశాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. నిబంధనల మేరకు చెల్లించాల్సిన రుసుము కింద మరో రూ. 9.65 లక్షలు వసూలు చేశారు. అత్యధికంగా హైదరాబాద్‌లోనే 63 వాహనాలకు జరిమానా విధించగా, సుమారు రూ. కోటిన్నర ఆదాయం చేకూరింది. మేడ్చల్-మల్కాజిగిరిలో మరో రూ. కోటిన్నర ఆదాయం వచ్చింది. ఈ జిల్లాల్లో 45 వాహనాలు, కరీంనగర్ 12, నిజామాబాద్ 14, నల్లగొండ 18, వరంగల్ 23, రంగారెడ్డిలో 36 చొప్పున నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సుల నుంచి జరిమానా వసూలు చేశారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా శారద బాధ్యతలు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకుంటున్న నేరెళ్ల శారద

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ బుద్ధభవన్‌లోని కమిషన్ ప్రధాన కార్యాలయంలో ఆమె పూజలు చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు కమిషన్ చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఆమెకు మంత్రులు దుద్దిల్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క శుభాకాంక్షలు తెలిపారు.

మేడిగడ్డ రక్షణపై రేపు ప్రత్యేక భేటీ

- 20న ఢిల్లీలో ఎన్‌డీఎస్‌ఏతో అధికారులతో చర్చ
- 2025 నాటికి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులు పూర్తి
- తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ ఆయకట్టు వచ్చేలా ప్రణాళికలు
- అదనంగా రూ.11 వేల కోట్ల కోసం ఆర్థికశాఖకు ప్రతిపాదనలు
- సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి
- జలసౌధలో ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ రక్షణ కోసం చేపట్టాల్సిన చర్యలపై ఈ నెల 20న ఢిల్లీలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించనున్నట్టు రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. సమ్మక్క బరాజ్ అనుమతుల కోసం త్వరలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, ఆ పనులను పూర్తి చేసేందుకు కావాల్సిన బడ్జెట్, తదితర అంశాలపై బుధవారం ఆయన జలసౌధలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా బేసిన్ పరిధిలోని పాలమూరు-రంగారెడ్డి, కోయిల్‌సాగర్, జేఎన్ఎల్ఐఎస్, డిండి, ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి ప్రాజెక్టులతోపాటు గోదావరి బేసిన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం, నీల్వాయి, పాలెంవాగు, మత్తడివాగు, ఎస్ఆర్ఎస్పీ ఫేజ్-2, చనాకా కోరాట, లోయర్ పెన్‌గంగా, దేవాదుల, మోడికుంటవాగు, ఎస్‌వైపీ, సీతారామ ప్రాజెక్టుల పురోగతిపై సమగ్రంగా చర్చించినట్టు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకుసాగుతున్నట్టు చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల నిర్మాణాన్ని 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖకు అదనంగా మరో రూ.11 వేల కోట్ల బడ్జెట్ అవసరమవుతుందని, ఆ నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి తోపాటు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలను పంపాలని నిర్ణయించామని వివరించారు. సకాలంలో ఈ ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా తొలుత 6.50 లక్షల ఎకరాలను సాగులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో భాగంగా ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రాధాన్య క్రమంలో 3 క్యాటగిరీలుగా విభజించామని తెలిపారు. 'ఏ' క్యాటగిరీలో రూ.240.66 కోట్లతో 47,882 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని చెప్పారు. రూ.7,500 కోట్ల అంచనా వ్యయంతో ప్రస్తుతం నిర్మిస్తున్న ప్రాజెక్టుల ద్వారా 5,84,770 ఎకరాల ఆయకట్టును సాగులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. నిర్మల్ జిల్లాలోని సదర్‌మాట్ ప్రాజెక్టును ఈ నెలాఖరున, ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టులో భాగమైన రాజీవ్ కెనాల్‌ను ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. సమీక్షా సమావేశంలో నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, అదనపు కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్సీ అనిల్ కుమార్, పీఅండ్ఎం ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణులను పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ బ్రాహ్మణులు, వేద పండితులను పట్టించుకోవడం లేదని, బ్రాహ్మణ పరిషత్ ద్వారా విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు నిధులు విడుదల చేయడంలేదని, బ్రాహ్మణులకు స్వయం ఉపాధి కింద రుణసౌకర్యం ఇస్తామని చెప్పి మోసం చేశారని, వేద పాఠశాలలకు సహకారం అందించడంలేదని ఆరోపించారు. వచ్చే బడ్జెట్‌లో బ్రాహ్మణ పరిషత్‌కు తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా స్వయంభూ దేవాలయాల వద్ద పూజారులను బదిలీ చేయలేదని చెప్పారు. దేవాలయాల్లో తల దూర్చవద్దని సీఎంకు హితవు పలికారు.

నైనీ బొగ్గుబ్లాక్ పనుల్లో వేగం పెంచాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థకు ఒడిశా రాష్ట్రంలో కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ పనుల్లో వేగం పెంచాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో నైనీ బొగ్గు బ్లాకుపై ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్, సింగరేణి సీఎండీ బలరామ్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. 4 నెలల్లో ఉత్పత్తిని ప్రారంభించాలని సూచించారు. నిర్వాసితులకు మెరుగైన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, సీఎస్సార్ పనులు, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. సింగరేణికి ఒడిశా అటవీశాఖ బదలాయించిన 783.27 హెక్టార్ల స్థలం అప్పగింతపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. సింగరేణి సీఎండీ బలరామ్ మాట్లాడుతూ.. నైనీ బొగ్గు బ్లాక్‌పై ప్రత్యేక శ్రద్ధచూపి అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేసిన డిప్యూటీ సీఎం భట్టికి ధన్యవాదాలు తెలిపారు. అక్టోబర్ నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తామని చెప్పారు.

ఢిల్లీలో కాదు గల్లీల్లో ఉండండి

- పదవుల కోసం నన్ను కలవండి
- టైమ్ ఇస్తా..ఓఎస్డీని నియమిస్తా
- పార్టీ, ప్రభుత్వ సమన్వయ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ) : 'ఢిల్లీలో ఎక్కువ ఉంటున్నారు.. గల్లీలో తక్కువ ఉంటున్నారు' అని పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులపై సీఎం, పీసీసీ అధినేత రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తంచేశారు. 'ఇప్పట్నుంచి ఇట్ల జరుగొద్దు.. గల్లీలో ఎక్కువ కనిపించాలె.. ఢిల్లీలో తక్కువ కనిపించాలె' అని హెచ్చరించారు. 'మీకు ఏదైనా ఉంటే నన్ను కలవండి.. ప్రతిరోజు సాయంత్రం సెక్రటేరియట్‌లో సమయం కేటాయిస్తా' అని చెప్పారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల అపాయింట్‌మెంట్ల కోసం ప్రత్యేకంగా ఓఎస్డీని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటిసారి ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం కోసం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రజాభవన్‌లో బుధవారం కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు,ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పీసీసీ ఆఫీస్ బేరర్స్‌పై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు రూ.30 వేల కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో 'మీరు (మంత్రులు, ఎమ్మెల్యేలు),నేను ఫెయిలయ్యాం' అని ఆయన వ్యాఖ్యానించినట్టు తెలిసింది. 'చేసిన పనిని మనం చెప్పుకోలేపోతున్నాం.. వారేమో (బీఆర్ఎస్) కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏ పనీ చేయడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారు' అని సీఎం అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. 'ఇప్పటికే కొన్ని నామినేటెడ్ పోస్టులు భర్తీ చేశాం.. ఇంకా చేయాలినవి ఉన్నాయి.. కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు తప్పకుండా ఉంటుంది.. ఆ విషయాన్ని నాకు వదలేసి మీ పని మీరు చేయండి' అని రేవంత్‌రెడ్డి అన్నట్టు తెలిసింది.

నలుగురు మంత్రులు, 8 మంది ఎమ్మెల్యేల డుమ్మా

ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయ సమావేశానికి నలుగురు మంత్రులు, ఎనిమిది మంది ఎమ